# రోడ్డు భద్రత వారోత్సవాల చిత్రాలు




రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
తెలంగాణ, హైదరాబాద్

# రోడ్డు భద్రత విద్య




రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
తెలంగాణ, హైదరాబాద్

# రోడ్డు భద్రతా విద్య

## కరదీపిక

**శ్రీ టి. విజయ్‌కుమార్, ఐ.ఏ.ఎస్.**
కమీషనర్, పాఠశాల విద్యాశాఖ
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ టి. క్రిష్ణ ప్రసాద్, ఐ.పి.ఎస్.,**
డి.జి.పి. & ఛైర్మన్, రోడ్ సేఫ్టీ అథారిటీ,
తెలంగాణ, హైదరాబాద్.

**రోడ్ సేఫ్టీ అథారిటీ,**
**తెలంగాణ, హైదరాబాద్.**

**ట్రాఫిక్ పోలీస్‌శాఖ**
**తెలంగాణ, హైదరాబాదు.**

**రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ**
**తెలంగాణ, హైదరాబాదు.**

## ముందుమాట

పిల్లలందరికీ....

మనం ప్రతి రోజు మన అవసరాలు తీర్చుకునేందుకు ఒక చోటు నుండి మరో చోటుకి ప్రయాణిస్తూ ఉంటాము. అయితే ఈ ప్రయాణంలో అందరూ తమ గమ్యాన్ని సురక్షితంగా చేరుకోలేకపోతున్నారు. మార్గ మధ్యంలో ఎన్నో కారణాల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. దాంతో వారి జీవితం చిన్నాభిన్నమై ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారు.

ఇట్టి ప్రమాదాలకు లోనుకాకుండా నియంత్రిస్తూ మన తెలంగాణ ప్రభుత్వ పోలీసుశాఖ నిర్విరామంగా కృషి చేస్తోంది. వివిధ మార్గాల ద్వారా ప్రజలలో అవగాహన పెంచుతోంది.

రోడ్డు ప్రమాదాలలో చిన్నారులు ఎక్కువగా ఉండడం గమనార్హం. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి పిల్లలు రోడ్డుపై నిబంధనలను పాటిస్తూ ప్రయాణించి సురక్షితంగా గమ్యం చేరుకోవడానికి తెలంగాణ పోలీసుశాఖ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ (ఎస్.సి.ఇ.ఆర్.టి.), తెలంగాణ వారి సౌజన్యంతో ఈ కరదీపిక రూపొందించబడింది.

ఈ కరదీపికలో **రోడ్డు భద్రత – ప్రాముఖ్యత, రోడ్డు గుర్తులు, రోడ్డు చిహ్నాలు, పాదచారుల భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్ – సైన్ బోర్డులు, వాహనాలు నిలుపు విధానం, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు ప్రమాద కారణాలు, భద్రత చర్యలు, తప్పనిసరిగా ఉండవలసిన పత్రాలు** మొదలగు అంశాలను వాటి సంబంధిత చిత్రాలతో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సరళ భాషలో వ్రాయబడినది.

రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి రాజీపడవద్దన్న దృఢ సంకల్పంతో పాఠశాల దశలోనే విద్యార్థులలో రోడ్డు భద్రతా బీజాలను నాటితే మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారని, సురక్షితంగా తమ గమ్యం చేరుకుంటారని కోరుకుంటున్నాము.

ఇందులో పొందుపరిచిన విషయాలు, పిల్లలు వారి తల్లిదండ్రులతో, చుట్టుపక్కల వారితో, స్నేహితులతో చర్చించి రోడ్డు భద్రతపై సమాజంలో అవగాహన కల్పించినట్లయితే రోడ్డు భద్రత ప్రజలందరి జీవనశైలిలో భాగమవుతుందని ఆశిస్తున్నాము.

**టి. క్రిష్ణ ప్రసాద్,** ఐ.పి.ఎస్.
అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్,
రోడ్ సేఫ్టీ అథారిటీ, తెలంగాణ, హైదరాబాద్.

స్థలం: హైదరాబాద్
తేది: జూన్, 2019

# ముందుమాట

పిల్లలందరికీ...

నిత్యం పెరుగుతున్న అధిక జనాభా, అదే స్థాయిలో పెరుగుతున్న వాహనాల సంఖ్య, రోడ్డు నియమాల పట్ల అవగాహన లోపించడం వలన అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. "నేటి బాలలు రేపటి పౌరులు" కావున పిల్లలలో రోడ్డు భద్రత పట్ల అవగాహన పెంచడానికి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి వివిధ తరగతుల్లో రవాణా విద్య పాఠ్యాంశాలను ప్రవేశపెట్టి పాఠశాల విద్యాశాఖ తనవంతు ప్రయత్నం చేస్తుంది.

జాతీయ పాఠ్యప్రణాళిక చట్రం-2005, రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం - 2011 మరియు ప్రపంచ ఆరోగ్య సంస్థ 2015లో రోడ్డు భద్రతపై ప్రకటించిన బ్రెసీలియా డిక్లరేషన్‌లోని ఆశయాలను నెరవేర్చడానికి ఈ కరదీపిక రూపొందించబడినది.

ఈ కరదీపికలో **రోడ్డు భద్రత - ప్రాముఖ్యత, రోడ్డు గుర్తులు, రోడ్డు చిహ్నాలు, పాదచారుల భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్ - సైన్ బోర్డులు, వాహనాలు నిలుపు విధానం, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు ప్రమాద కారణాలు, భద్రత చర్యలు, తప్పనిసరిగా ఉండవలసిన పత్రాలు** మొదలగు అంశాలను పొందుపరచడమైనది. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సరళభాషలో సంబంధిత చిత్రాలతో వ్రాయబడినది. ఈ కరదీపికలోని బాక్సుల్లో ఇచ్చిన అంశాలు, ప్రతీ పేజీలో క్రింద ఇవ్వబడిన నినాదాలు విద్యార్థుల అవగాహన మరింత పెంపొందించడానికి దోహదపడతాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ట్రాఫిక్ పోలీస్ శాఖ, పాఠశాల విద్యాశాఖ (ఎస్.సి.ఇ.ఆర్.టి.)ల సమన్వయంతో రోడ్డు భద్రతపై రూపొందించబడిన ఈ కరదీపిక విద్యార్థినీ విద్యార్థులలో చైతన్యం పెంపొందించడమే కాక తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతకు సహాయపడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గడానికి మరియు నివారించడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నాము.

స్థలం: హైదరాబాద్
తేది: ఫిబ్రవరి, 2017

**ఎస్. జగన్నాథ రెడ్డి**
సంచాలకులు
రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

## రూపకల్పనలో పాల్గొన్నవారు

**డా॥ ఆర్. గణపతి,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా., లాడెల్ల, దామెర (మం), వరంగల్ రూరల్.
**శ్రీ ఎన్. రాజ్‌పాల్ రెడ్డి,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా., శివరాంపల్లి, జనగాం.
**శ్రీమతి హెచ్. హిరణ్య,** ఎస్.ఎ., ప్ర.ఉ.పా., బొల్లారం, హైదరాబాద్.
**శ్రీమతి ఎ. జానకి దేవి,** ఎస్.ఎ., ప్ర.ఉ.పా., శేరిలింగంపల్లి, రంగారెడ్డి.
**శ్రీ కె. చంద్రశేఖర్ ,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా., శ్రీరంగవరం, మేడ్చల్.
**శ్రీమతి వి. ఉమారాణి,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా., అమీర్‌పేట, రంగారెడ్డి.
**శ్రీ కె. ప్రభాకర్ రెడ్డి,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా., షాబాద్, రంగారెడ్డి.
**శ్రీ ప్రసూన్ కుమార్,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా., డోంగ్లి, కామారెడ్డి.
**శ్రీ ఎ. అశోక్ కుమార్,** ఎస్.ఎ., జి.ప.ఉ.పా., శనిగరం, వరంగల్ అర్బన్.
**శ్రీ ఎల్లయ్య,** పి.జి.టి., మోడల్ స్కూల్, శాలిగౌరారం, నల్లగొండ.
**శ్రీ ఎన్.సి. జగన్నాథ్,** ప్రా.పా, కుల్సుంపురా, హైదరాబాద్.

## గ్రాఫిక్స్ & డిజైనింగ్

**శ్రీ దార కన్నయ్య,** డి.పి.ఓ.,
ఎస్.సి.ఇ.ఆర్.టి, తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ ఓరుగంటి వెంకన్న,** డి.పి.ఓ.,
ఎస్.సి.ఇ.ఆర్.టి, తెలంగాణ, హైదరాబాద్.

## సమన్వయం

**శ్రీమతి కె.ఎస్. సత్యప్రియ,**
ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ జి. హరీశ్,**
ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్, గోషామహల్
హైదరాబాద్.

## సలహాదారులు

**శ్రీ పి. శ్రీనివాస్,**
ఆర్.టి.ఓ., హైదరాబాద్.

**శ్రీ ఎ.వి.. శ్రీనివాస్,**
డి.ఎస్.పి., రోడ్ సేఫ్టీ అథారిటీ, హైదరాబాద్.

**శ్రీ ఎల్. విజయ్ కుమార్,**
ఎ.సి.పి., తెలంగాణ పోలీస్ అకాడమీ.

**శ్రీమతి ఎం. నాగమణి,**
ఎ.సి.పి., తెలంగాణ పోలీస్ అకాడమీ.

## ముఖ్యసలహాదారులు

**శ్రీ ఎస్. జగన్నాథరెడ్డి,**
సంచాలకులు, ఎస్.సి.ఇ.ఆర్.టి,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ ఎ.వి. రంగనాథ్, ఐ.పి.ఎస్.,**
డి.సి.పి. ట్రాఫిక్,
హైదరాబాద్.

## ప్రత్యేక సలహాదారులు

**శ్రీ జి. కిషన్, ఐ.ఏ.ఎస్.,**
పాఠశాల సంచాలకులు,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ టి. క్రిష్ణ ప్రసాద్, ఐ.పి.ఎస్.,**
అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్,
రోడ్ సేఫ్టీ అథారిటీ, తెలంగాణ, హైదరాబాద్.

## విషయసూచిక


| క్ర.సం. | పాఠం పేరు | పేజి |
| --- | --- | --- |
| 1. | రోడ్డు భద్రత - ప్రాముఖ్యత | 1-6 |
| 2. | రోడ్డు గుర్తులు | 7-9 |
| 3. | రోడ్డు చిహ్నలు | 10-12 |
| 4. | పాదచారుల భద్రత | 13-14 |
| 5. | ట్రాఫిక్ సిగ్నల్స్ - సైన్ బోర్డులు | 15-17 |
| 6. | వాహనాలు నిలుపు విధానం | 18-24 |
| 7. | ట్రాఫిక్ నిర్వహణ | 25-31 |
| 8. | రోడ్డు ప్రమాద కారణాలు | 32-39 |
| 9. | భద్రతా చర్యలు | 40-47 |
| 10. | తప్పనిసరిగా ఉండవలసిన పత్రాలు | 48-53 |


Happy Teaching

# 1 రోడ్డు భద్రత - ప్రాముఖ్యత (Road Safety - Importance)

**విద్యార్థులూ!**

మనం నిత్యం ఏదో ఒక సందర్భంలో రోడ్డుపైకి వెళుతుంటాం కదా! మీరు పాఠశాలకు వెళ్ళాలంటే ఎలా వెళ్తారు? మీ తల్లిదండ్రులు మార్కెట్‌కు ఎలా వెళ్తారు? మీరు సెలవుల్లో ఎక్కడికైనా వెళ్ళాలంటే ఎలా వెళ్తారు? ఇలా ప్రతిరోజూ ఏదో ఒక పనిమీద మనం రోడ్డును ఉపయోగిస్తుంటాం కదా! మరి ఆ రోడ్డుపై వెళ్ళేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవటం మన బాధ్యత.

ప్రపంచంలో రోడ్డు ప్రమాదాల కారణంగా జరిగే మరణాలలో మన దేశం ద్వితియ స్థానంలో ఉండడం అందోళన కలిగించే విషయం. మన దేశంలో ప్రతినిత్యం ఎంతోమంది రోడ్డు ప్రమాదాల కారణంగా మరణిస్తున్నారు. చాలామంది క్షతగాత్రులవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారం కేవలం తెలంగాణలోనే 2016 సం॥లో 22,033 ప్రమాదాలు జరిగాయి. ఆ ప్రమాదాలలో 6,910 మంది చనిపోయారు. 23,554 మంది క్షతగాత్రులయ్యారు (అంగవైకల్యం).

2014 నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ రిపోర్టు ప్రకారం రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్న వారిలో 3 శాతం పిల్లలే. ప్రతి రోజూ 480 మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారు. కనుక పెద్దలు, తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు రోడ్డు భద్రత యొక్క అవశ్యకతను తప్పనిసరిగా తెలియజేయాలి. రోడ్డు ప్రమాదాల నివారణా మార్గాలను కూడా తప్పని సరిగా తెలియజేయాలి.

రోడ్డు భద్రత అనేది కేవలం రోడ్డుమీద నడచివెళ్ళేవాళ్ళకు మాత్రమేకాదు, రోడ్డుమీద వాహనాలు నడిపే వాళ్ళు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలి. మనకు ముఖ్యమైనది ఏమనగా మనం సురక్షితంగా ఉండటమే గాక మనవల్ల ఇతరులు అసౌకర్యానికి, ప్రమాదాలకు లోనుకాకుండా ఉండటము. ఒక్కోసారి అజాగ్రత్తగా చేసే చిన్న, చిన్న పొరపాట్లకు భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది.

రోడ్డు మీద మనం తరచుగా గమనించే మరో విషయం ఏమిటంటే మన ప్రమేయం లేకుండానే ఇతరుల నిర్లక్ష్యం, తొందరపాటు వలన మనం కూడా ప్రమాదాలకు లోనయ్యే సందర్భాలు చాలా ఉంటాయి. కనుక మనం రోడ్డు మీద నిలబడి ఉన్నప్పుడు, నడుస్తున్నప్పుడు, రోడ్డు దాటుతున్నప్పుడు జాగ్రత్తగా పరిసరాలను గమనించవలెను. అంతేకాకుండా కదులుతున్న వాహనాలను ఎక్కడం, దిగడం

**రోడ్డు భద్రత - ప్రతిపౌరుని బాధ్యత**

# రోడ్డు ప్రమాద గాయాలు : వాస్తవాలు

ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవిస్తున్న మరణాలు

**1.25 మిలియన్**




15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు వారి మరణాలకు **#1** కారణం.


ప్రతి నలుగురు(4)లో ముగ్గురు (3) పురుషులు రోడ్డు ప్రమాదాల కారణంగా మరణిస్తున్నారు.



ప్రపంచంలోని వాహనాలలో సగం మాత్రమే తక్కువ మరియు మధ్యస్థాయి ఆదాయ దేశాలలో ఉన్నప్పటికీ 90% రోడ్డు ప్రమాద మరణాలు ఈ దేశాలలో సంభవిస్తున్నాయి.





తక్కువ ఆదాయ దేశాలు అధిక రోడ్డు ప్రమాద మరణాల రేట్లు కలిగి ఉన్నాయి.




1,00,000 జనాభాకి రోడ్డు ప్రమాద మరణాలు

మీరు నివసిస్తున్న ప్రాంతం ఆధారంగా రోడ్డు ప్రమాద మరణం సంభవించే అవకాశం




1,00,000 జనాభాకి రోడ్డు ప్రమాద మరణాలు




మొత్తం రోడ్డు ప్రమాద మరణాలలో **49%** పాదచారులు, సైకిల్ నడిపేవారు మరియు మోటర్ సైకిల్స్ నడిపేవారికి సంభవిస్తున్నాయి.

World Health Organization

**Global status report on road safety 2015**
www.who.int/violence_injury_prevention/road_safety_status/2015/en/

DECADE OF ACTION FOR ROAD SAFETY 2011-2020

భద్రతను పాటించడం - బాధ్యతను గుర్తించడం

వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, అంగవైకల్యం కావటం జరుగుతుంది.

### ఈ ప్రమాదాలు ఇంత ఎక్కువగా ఉండటానికి కారణం ఏమై ఉంటుంది?

మనకు రోడ్డు భద్రతా నియమాలపై సరియైన అవగాహన లేకపోవడం ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం. అవగాహన ఉన్నవారు సైతం వాటిని యథేచ్ఛగా ఉల్లంఘించడం, నియమాలను పాటించడం పట్ల ఉదాసీనత వైఖరి చూపడం ప్రమాదాలకు కారణం.

రోడ్డు ప్రమాదాలతో మనం మూడు రకాలుగా సంబంధం కల్గివుండే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాద బాధితులం కావచ్చు, రోడ్డు ప్రమాద కారకులం కావచ్చు లేదా రోడ్డు ప్రమాద సమయంలో అక్కడే వుండి సాక్షులై వుండవచ్చు. ఈ సందర్భాలలో మనం ఎలా స్పందించాలో, ప్రమాద నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ పుస్తకంలో మనం తెలుసుకుందాం.

### రవాణా వ్యవస్థ - రకాలు

రహదారిపై ప్రయాణించే రవాణా వాహనాలు చాలారకాలుగా వుంటాయి. మన దేశంలో రవాణా సౌకర్యాలలో వాయు రవాణా, రైల్వే రవాణా, జల రవాణా, రోడ్డు రవాణా అని ముఖ్యమైన రవాణా వ్యవస్థలున్నాయి. వీటిలో ప్రజలకు బాగా అందుబాటులో ఉండి విరివిగా ఉపయోగింపబడుతున్నది రోడ్డు రవాణా వ్యవస్థ.

ఇంత ప్రాధాన్యత కలిగిన వ్యవస్థలో మనం వివిధ రకాల రవాణా సాధనాల ద్వారా నిత్య జీవిత అవసరాలను తీర్చుకొంటున్నాము. రోడ్డు మార్గాలను పాదచారులతో పాటు, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, కార్లు, జీపులు, ప్రజారవాణాకు సంబంధించి అనేక రకాల వాహనాలు ఉన్నాయి. ఈ క్రమంలో సైకిలు, మోటార్ సైకిళ్ళు, ఆటోలు, కార్లు, ప్రైవేటు యాజమాన్య బస్సులు, ఆర్టీసీ బస్సులు సరుకు రవాణా వాహనాలు ఉపయోగిస్తున్నాము.

**మీకు తెలుసా?**

**రోడ్డు ప్రమాదాల వల్ల అత్యంత తక్కువగా మరణాలు సంభవిస్తున్న దేశం స్వీడన్. ఇక్కడ సగటున ఒక సం॥నికి లక్షమంది ప్రజలతో 2.8 మంది మాత్రమే రోడ్డు ప్రమాదాల కారణంగా మరణిస్తున్నారు.**

**నీ జాగ్రత్తే నీ రక్షణ!**

1. ప్రజా రవాణా వ్యవస్థ.

2. సరకుల రవాణా వ్యవస్థ.

## 1. ప్రజా రవాణా వ్యవస్థకు ఉపయోగించే వాహనాలు

ప్రజలు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్ళడానికి వివిధ రకాల వాహనాలు ఉపయోగిస్తుంటారు.

వాహనాలు

- ద్విచక్ర
- త్రిచక్ర
- నాలుగు చక్ర వాహనాలు
- భారీ వాహనాలు

**ద్విచక్ర వాహనాలు :** ఈ వాహనాలకు రెండు చక్రాలు ఉండును. ఉదా: సైకిల్, మోటర్ సైకిల్.



**సైకిల్:** సైకిల్‌ను చాలా ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీనికి కొనుగోలు ఖర్చు కూడా తక్కువ. నిర్వహణ వ్యయం కూడ తక్కువే. దీనిని అన్ని ప్రాంతాల్లో అన్ని ఆదాయ స్థాయిలవారు ఉపయోగిస్తారు. దీని వాడకం పర్యావరణ హితం.

**మోటర్‌సైకిల్ / స్కూటర్ :** సైకిల్ తరువాత ఎక్కువగా రవాణాకు ఉపయోగించే వాహనం మోటర్ సైకిల్ / స్కూటర్. దీన్ని అన్ని ప్రాంతాలకు సులువుగా రవాణాకు ఉపయోగించవచ్చు. సైకిల్‌తో పోలిస్తే కొనుగోలు, నిర్వహణ వ్యయం కాస్త ఎక్కువే.



**మీకు తెలుసా?**

**ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను మొదటిసారిగా ఆగస్టు 5, 1914లో అమెరికన్ ట్రాఫిక్ సిగ్నల్ కంపెనీ ఒహాయో రాష్ట్రంలోని క్లీవ్‌లాండ్ నందు ప్రవేశ పెట్టారు.**

రహదారులు దేశ ప్రగతికి సోపానాలు

**త్రిచక్ర వాహనాలు :** మూడు చక్రాల వాహనాల్లో మనుషులు నడిపే రిక్షా, ఆటోలు ముఖ్యమైనవి. తక్కువ దూరం ప్రయాణించడానికి రిక్షాలు ఉపయోగిస్తారు. ఇవి ద్వితీయ శ్రేణి నగరాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. స్కూల్ విద్యార్థులను స్కూల్‌కి చేర్చడానికి ఉపయోగిస్తారు.



**ఆటోలు:** పట్టణాలు, గ్రామాలనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో విరివిగా ప్రయాణానికి ఉపయోగిస్తారు.

**కార్లు / జీపులు (నాలుగు చక్ర వాహనాలు) :** వీటిలో ప్రధానంగా జీపులు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగాను, పట్టణాల్లో అక్కడక్కడా ఉపయోగిస్తుంటారు. కార్లు నగరాలలో, మహానగరాలలో రవాణాకు ఉపయోగిస్తారు. వీటి కొనుగోలు మరియు నిర్వహణ వ్యయం ఎక్కువైనా వీటి సంఖ్య రోడ్డుపై పెరగడం గమనార్హం.

**భారీ వాహనాలు:** ప్రయాణీకులను తమ గమ్యానికి చేరవేయడానికి బస్సులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. బస్సులో ప్రయాణం తక్కువ ఖర్చుతో కూడినది. చాలా మంది ఒకేసారి ఒకే బస్సులో ప్రయాణించడం వలన రోడ్డుపై ట్రాఫిక్ జామ్ మరియు కాలుష్యం తగ్గుతుంది. వీటిని గ్రామాలలో మరియు పట్టణాలలో అత్యధికంగా ఉపయోగిస్తున్నారు. ఇవి ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగంలో ఉన్నవి.




## 2. సరుకుల రవాణాకు ఉపయోగించే వాహనాలు

ప్రజల రవాణాకు వివిధ వాహనాలను ఏ విధంగా ఉపయోగిస్తారో సరుకుల రవాణాకు కూడా వివిధ వాహనాలను ఉపయోగిస్తారు.

వాహనాలు
- త్రిచక్ర వాహనాలు
- నాలుగు చక్రాల వాహనాలు
- భారీ వాహనాలు

**రోడ్డును జాగ్రత్తగా వాడండి – సురక్షితంగా ఇంటికి చేరండి**

**త్రిచక్ర వాహనాలు:** సరుకుల రవాణాకు రిక్షాలు, ట్రాలీ ఆటోలు మరియు ట్రాక్టర్లను ఉపయోగిస్తారు. ఈ వాహనాలను ఒక గ్రామం లేదా పట్టణంలో సరుకు రవాణాకు ఉపయోగిస్తారు.





**నాలుగు చక్రాల వాహనాలు:** సరకు రవాణాకు భారీ వాహనాలేకాక చిన్న వాహనాలు కూడా అందుబాటులో ఉన్నవి. ఈ వాహనాలు తక్కువ దూరం సరుకులు పంపుటకు ఉపయోగిస్తారు.

**భారీ వాహనాలు:** సరుకు రవాణాకు అత్యధికంగా లారీ లాంటి భారీ వాహనాలు ఉపయోగిస్తారు. వీటి వలన సరుకులు దూర ప్రాంతాలకి చేరుతాయి. ఈ వాహనాలు రాష్ట్ర స్థాయిలోను, జాతీయ స్థాయిలోను తిరగడానికి అనుమతి కలిగి ఉంటాయి. రాష్ట్ర రాజధానులకు, ప్రధాన నగరాలకు, ఒడ రేవు నగరాలకు సరుకులను రవాణా చేస్తూ అంతర్జాతీయ వ్యాపారానికి దోహదపడుతాయి.



ప్రజలు, సరుకుల రవాణా ఏదైనా, ఏ రకమైన వాహనమైనా బయలుదేరిన స్థానం నుండి గమ్యస్థానం వరకు జాగ్రత్త వహిస్తూ ప్రయాణించాలి.

**మీకు తెలుసా?**

ఒక ప్రదేశంలో వాయు కాలుష్య తీవ్రతను గాలి నాణ్యతా సూచిక (Air Quality Index) ద్వారా తెలియజేస్తారు. ఇది ఎంత ఎక్కువ ఉంటే అంతగా వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్నట్లు అర్థం.

**రోడ్డు ప్రమాదం - కుటుంబానికి తీరని శోకం**

# 2 రోడ్డు గుర్తులు (Markings)


రోడ్డుపై ఉండే గుర్తుల (markings) ప్రధాన ఉద్దేశం ట్రాఫిక్‌ను నియంత్రించడానికి మరియు సురక్షితంగా, సునాయాసంగా ట్రాఫిక్ కదలడానికి ఉపయోగపడుతుంది. ఈ గుర్తుల ఆధారంగా రోడ్లను ఉపయోగించి స్వయం నియంత్రణ పొందుటకు సహాయం చేస్తాయి.

## రోడ్డు గుర్తులు – వర్గీకరణ

1. రేఖాంశ సంబంధమైన గుర్తులు (Longitudinal markings)
2. విలోమ గుర్తులు (Transverse markings)
3. వస్తు సంబంధ గుర్తులు (Object markings)
4. పద సందేశాలు (Word messages)
5. పార్కింగ్ చేయుటకు ఉద్దేశింపబడిన గుర్తులు (Markings for parking)
6. ప్రమాద సందేశాలు తెలియజేయు గుర్తులు (Markings at hazardous locations etc.)

### 1. రేఖాంశ సంబంధమైన గుర్తులు (Longitudinal markings)

వాహనదారులు ప్రయాణిస్తున్న దిశలో రోడ్డుపై వారి వాహన ఉనికిని అంటే రోడ్డుపై ఏ భాగంలో ఆ వాహనం ప్రయాణిస్తుందే తెలియజేయడానికి చిత్రించే గుర్తులు. ఒకే దిశలో ప్రయాణించే వాహనాల వరుసలను వేరు చేయు ఈ గుర్తులు స్పష్టంగా కనిపించుటకు తెలుపు రంగులో ఉంటాయి. **పసుపు రంగు** ఎదురుగా వచ్చే వాహనాల వరుసలను వేరు చేయుటకు ఉపయోగిస్తారు. అంతేకాకుండా ఈ రంగు పాదచారుల మార్గం అంచులను వేరు చేయుటకు ఉపయోగిస్తారు.




**భద్రతా సూత్రాలను ధిక్కరించడం – ప్రమాదాలను ఆహ్వానించడం**

## 2. విలోమ గుర్తులు (Transverse markings)

ఈ గుర్తులు ట్రాఫిక్ ప్రయాణ దిశకు అడ్డంగా ప్రత్యేకంగా రోడ్ల కలయిక వద్ద వేస్తారు. ఇవి రోడ్ల రకాలు, ట్రాఫిక్, రోడ్డు వెడల్పు, వాహనాల వేగాన్ని బట్టి వేయడం జరుగుతుంది. ఉదాహరణకు స్టాప్ లైన్, జీబ్రా క్రాసింగ్.



## 3. వస్తు సంబంధ గుర్తులు (Object markings)

రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు రోడ్డు మధ్యలో అడ్డుగా వచ్చు అంశాలు. ఉదాహరణకు ట్రాఫిక్ ద్వీపములు, సిగ్నల్ పోల్స్ మొదలైనవి. ఇవి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ప్రమాదాలకు కూడా కారణం కావచ్చు. అందువలన వాటిని తెలియజేయడానికి తగిన విధంగా రంగులు వేయడం లేదా స్పష్టంగా తెలిసే విధంగా గుర్తులను ఏర్పాటు చేయడాన్నే వస్తు సంబంధ గుర్తులు అంటారు.

## 4. పద సందేశాలు (Word messages)

ఈ పద సందేశాలు రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు సహాయకారిగా, హెచ్చరించేవిగా, నియంత్రించేవిగా ఉంటాయి. ఇవి పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాయబడి ఉంటాయి. ఉదాహరణకు STOP, SLOW, SCHOOL, RIGHT, TURN ONLY మొదలగునవి.






## 5. పార్కింగ్ చేయుటకు ఉద్దేశింపబడిన గుర్తులు (Markings for parking)



వాహనాల పార్కింగ్ ప్రదేశాలను గుర్తించడం వలన పార్కింగ్ ప్రాంతాలను సమర్థవంతంగా నిర్వహించుటకు, దురాక్రమణలను నిరోధించుటకు వీలవుతుంది. వాహనాల పార్కింగ్ ప్రదేశాలను తెల్లని సాలిడ్ లైన్స్‌లతోను, పెద్ద అక్షరాలతోను వేస్తారు.

## 6. ప్రమాద సందేశాలు తెలియజేయు గుర్తులు (Markings at hazardous locations etc.)

ఈ గుర్తులు వాహనదారులకు రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు రోడ్డు యొక్క స్థితిగతులను తెలియజేసి, ప్రమాదాలను నివారించడానికి ఉపయోగపడతాయి.




# 3 రోడ్డు చిహ్నాలు (Road Signage)

రోడ్డును ఉపయోగించే పాదచారులకు, వాహనదారులకు రోడ్డు యొక్క తీరును గురించి సమాచారాన్ని అందిస్తాయి. ఈ రోడ్డు చిహ్నాలను సరిగ్గా పాటించినట్లయితే ప్రమాదాలను తగ్గించడమే కాకుండా పర్యావరణంపైన భారాన్ని కూడా తగ్గిస్తాయి. రోడ్డు చిహ్నాలు మూడు రకాలుగా విభజింపబడ్డాయి. అవి:

1. తప్పనిసరిగా పాటించాల్సిన చిహ్నాలు (Mandatory signs)
2. హెచ్చరిక చిహ్నాలు (Cautionary signs)
3. సమాచార చిహ్నాలు (Information signs)

## 1. తప్పనిసరిగా పాటించాల్సిన చిహ్నాలు (Mandatory signs)

STOP, GIVE  AWAY ఈ చిహ్నాలు తప్పితే మిగతా చిహ్నాలన్ని గుండ్రని ఆకారంలో ఉంటాయి. ఈ చిహ్నాలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాలి. పాటించనట్లయితే నేరస్తులుగా పరిగణించబడతారు.




## 2. హెచ్చరిక చిహ్నాలు (Cautionary signs)

ఈ చిహ్నాలు వాహనదారులకు రోడ్డుపై దగ్గరలో ఉన్న ప్రమాదాలను సూచిస్తాయి. వీటి ఆధారంగా వాహనదారులు సరైన రీతిలో వాహనాలను నడిపినట్లయితే ప్రమాదాలను నిరోధించవచ్చు. ఇవి సాధారణంగా త్రికోణ ఆకారంలో ఉంటాయి.



### 3. సమాచార చిహ్నాలు (Information signs)

ఈ చిహ్నాలు రోడ్డుపై ప్రయాణించే వాహనాలకు మార్గదర్శకంగా ఉంటాయి. ఇవి రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు సౌకర్యవంతంగా, సులభతరంగా, ఆహ్లాదకరంగా ఉంటాయి. ఈ చిహ్నాలు రోడ్డు దగ్గరలో ఉన్న భౌగోళిక, చారిత్రాత్మక ప్రదేశాలను గురించి తెలుపుతాయి.



# 4 పాదచారుల భద్రత (Pedestrains Safety)

ప్రపంచంలో రోడ్ల ప్రమాదాల వలన ప్రతీ సంవత్సరం 2,70,000 తమ ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ రోడ్డు ప్రమాదాలలో 22% పాదచారులే ఉండటం గమనార్హం. కొన్ని దేశాలలో ఇది కొంచెం ఎక్కువగా కూడా ఉండవచ్చును.

10 లక్షల కంటే ఎక్కువ మంది పాదచారులు గాయాలపాలవుతున్నారు. కొంత మంది శాశ్వతమైన అంగవైకల్యానికి గురవుతున్నారు. ఈ ప్రమాదాల వలన పాదచారుల భద్రత కూడా ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఈ ప్రమాదాల వలన సంభవించే మరణాల సంఖ్య తగ్గించడానికి రోడ్డు భద్రతా విద్యపై మరియు ట్రాఫిక్ నిబంధనలపై దృష్టి సారించడం జరిగింది.

సాధారణంగా తలకు గాయం కారణంగా పాదచారులు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారు. దీనిని అధిగమించడానికి ప్రతి వాహనానికి ముందువైపు Frontal Protection System (FPS) అమర్చడం జరుగుతుంది.

## పాదచారుల ప్రమాదాలకు కారణాలు

- డ్రైవర్ తాగి మరియు అతి వేగంగా వాహనం నడపడం
- పాదచారులకు సరైన సౌకర్యాలు లేకపోవడం (ఉదా: ఫుట్‌పాత్‌లు మొదలగునవి)
- వాహన పరిస్థితి సరిగా లేకపోవడం
- రోడ్డు యొక్క దుస్థితి
- సరైన సమయంలో వైద్యం అందకపోవడం



## పాదచారుల భద్రతకు సూచనలు

- ఫుట్‌పాత్‌లపైన నడవాలి.
- రాత్రి సమయంలో నడిచేటప్పుడు ప్రకాశవంతమైన దుస్తులు ధరించాలి.

- వాహనం ఆగిన తర్వాత మాత్రమే రోడ్డును దాటాలి. మిమ్మల్ని చూసి వాహనం నిలుపుతారని ఆశించవద్దు.
- వాహనానికి ముందుగాని, వెనుకగాని నడువవద్దు.
- ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాలు ఆగినప్పుడు మాత్రమే రోడ్డును దాటవలెను.





- రోడ్డును దాటేటప్పుడు ఫోన్‌లో మాట్లాడడం గాని, హెడ్‌ఫోన్స్, ఇయర్‌ఫోన్స్ వంటివి ఉపయోగించవద్దు.

- వృద్ధులు, వికలాంగులు మొదలగు వారికి రోడ్డు దాటుటలో సహాయ పడండి.



**మీకు తెలుసా?**

**భారత దేశంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రతీ సంవత్సరం జనవరి నెలలో జరుపుకుంటారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించి అనేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తారు.**

# 5 ట్రాఫిక్ సిగ్నల్స్ - సైన్ బోర్డులు (Traffic Signals - Sign Boards)

ప్రపంచంలో మొదటిసారిగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను 1868, డిసెంబర్ మాసంలో లండన్‌లో ప్రారంభించారు. ఈ సిగ్నల్స్ గ్యాస్‌తో వెలిగించబడి మానవులచే నిర్వహింపబడేవి. కాని ఇవి ఒక నెలలోపులోనే పేలడం వలన వీటిని నిర్వహించిన పోలీసులు మరణించారు. దీంతో ఈ సిగ్నల్స్‌ను ఆపివేశారు.

1910 సం॥లో చికాగోకు చెందిన ఎర్నెస్ట్ సిరీన్ మొదటి స్వయంచలిత (ఆటోమేటిక్) ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కనిపెట్టారు. ఇవి కేవలం ఆగుము, వెళ్ళుము అనే పదాలను మాత్రమే ఉపయోగించేవి.

1912 సం॥లో లిస్ట్ వైర్ అనే అమెరికన్ పోలీసు ఎరుపు, ఆకుపచ్చ రంగులను ట్రాఫిక్ సిగ్నల్స్‌లో ఉపయోగించారు. పూర్తి ఆటోమేటిక్ సిగ్నల్ సిస్టమ్ 1914, ఆగస్టు 4న అమెరికా దేశంలోని ఓహియో రాష్ట్రంలోని క్లీన్‌ల్యాండ్‌లో ప్రారంభించబడినది.

ట్రాఫిక్ సిగ్నల్స్ అనేవి రోడ్డుపై వాహనాల రాకపోకలను నియంత్రించే ఎలక్ట్రానిక్ సిగ్నలింగ్ వ్యవస్థ. నగరాలలోని ప్రధాన కూడళ్ళ వద్ద ప్రమాదాలు జరగకుండా ఈ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తారు.

## ట్రాఫిక్ సిగ్నల్స్



దీనిలో మూడు రంగులు గల విద్యుత్ దీపాలు ఉంటాయి. అన్నింటికన్నా పైన ఎరుపు రంగు (Red) విద్యుత్ దీపం ఉంటుంది. ఇది వెలిగినపుడు వాహనదారులు తమ వాహనాలను తప్పనిసరిగా ఆపవలెను.

మధ్యలో ఆరెంజ్ (Orange) రంగు విద్యుత్ దీపం వెలిగినపుడు వాహనదారులు తమ వాహనాలను నిలపడానికి లేదా ముందుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉండాలి.


అన్నింటికన్నా క్రింద ఉన్న ఆకుపచ్చ (Green) రంగు విద్యుత్ దీపం వెలిగినపుడు వాహనదారులు ముందుకు వెళ్ళాలి.

భద్రతా సూత్రాలను ధిక్కరించడం - ప్రమాదాలను ఆహ్వానించడం

రాత్రివేళల్లో కొన్ని కూడళ్ళలో ఆరెంజ్ లైట్ వెలిగి, ఆరుతున్నప్పుడు (బ్లింక్) వాహనదారులు ఆగి, చూసి వెళ్ళాలి.

## రోడ్డు సూచికలు


రోడ్డు నేరుగా, విశాలంగా అంతటా ఒకే విధంగా ఉండదు. కనుక ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖవారు వివిధ రకాలైన సూచికలను రోడ్డుకు ఇరువైపులా అమరుస్తారు. పాదచారులు నడిచేటప్పుడు, వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు సూచికలను పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చు. వీటిలో ముఖ్యమైనవాటిని ఇక్కడ పరిశీలించండి.



- వన్‌వే (ఈ గుర్తు ఉన్న రోడ్డుపై ఒకేవైపు ప్రయాణం అనుమతించబడుతుంది. రెండో వైపు ప్రయాణం నిషేధం.




- నో పార్కింగ్ (ఈ గర్తు ఉన్నచోట వాహన పార్కింగ్ చేయకూడదు. వాహనాన్ని నిలిపి ఉంచరాదు.)



- 'U' యూటర్న్ తీసుకోకూడదు. (ఈ గుర్తు ఉన్నచోట యూటర్న్ తీసుకోకూడదు).

- హారన్ మ్రోగించకూడదు. (ఈ గుర్తు ఉన్న ప్రాంతాల్లో హారన్ మ్రోగించకూడదు).




**భద్రత పాటిస్తే పన్నీరు - లేకుంటే కన్నీరు**



- స్కూల్ జోన్ (ఈ గుర్తు ఉన్న ప్రాంతాల్లో స్కూల్ ఉన్నది అని అర్థం. కాబట్టి వేగాన్ని తగ్గించి వెళ్ళాలి).




- హాస్పిటల్ జోన్ (ఈ గుర్తు ఉన్నచోట హాస్పిటల్ ఉన్నదని అర్థం కాబట్టి అక్కడ అతిగా హారన్ మ్రోగిస్తూ రోగులకు ఇబ్బంది కలిగించకూడదు.

**మీకు తెలుసా?**

**ఒక వాహన వేగాన్ని గంటకు 5 కి.మీ. చొప్పున పెంచినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం 40% పెరుగుతుంది.**

# 6 వాహనాలు నిలుపు విధానం (Parking System)

జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం ఒక 'కళ'. అలాగే మన వాహనాన్ని సరియైన ప్రదేశంలో, సరియైన పద్ధతిలో, నిలపటం (పార్క్) కూడా చిన్న విషయమేమీ కాదు.

విద్యార్థులారా! ఒకసారి ఆలోచించండి. పార్కింగ్ వ్యవస్థ సరిగాలేక, ఉన్న కొద్ది పార్కింగ్ స్థలంలో ఇష్టం వచ్చినట్టు వాహనాన్ని పార్క్‌చేయడం వలన ఇతరులకు ఇబ్బంది కలిగించటమే కాకుండా, మనం కూడా ఇబ్బంది పడతాం. దీనివల్ల సంతోషంగా సినిమాకో, ఫంక్షన్‌కో, షాపింగ్‌కో అని వెళ్ళి పార్కింగ్‌లో అవస్థలు పడుతూ కొన్నిసార్లు గొడవలకు కూడా దారితీసి, సంతోషం పాడై దీని ప్రభావం డ్రైవింగ్ మీద పడుతుంది.



హైదరాబాద్ మహానగరంతో పాటు రాష్ట్రంలోని ఇంచుమించు అన్ని పట్టణాలలోను ఈ పార్కింగ్ (వాహనాలను నిలపటం) పెద్ద సమస్యగా మారింది. నిర్లక్ష్యం, అవగాహనా లేమి, స్థలం లేకపోవటం, తొందరపాటు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, సినిమా హాళ్ళు మొదలైన ప్రజా ఉపయోగ భవన సముదాయాలు సరియైన పార్కింగ్ వ్యవస్థ లేకుండానే నిర్వహించటం వల్ల చాలా సమస్యలకు కారణం అవుతున్నాయి.



ముఖ్యంగా పట్టణాలు, నగరాలలో ప్రధాన రహదారిపై అడ్డదిడ్డంగా చేసే పార్కింగ్‌తో రోడ్డు ఇరుకైపోతుంది. దానివల్ల అనుకున్న సమయానికి తమతమ గమ్యస్థానాలను చేరుకోవటానికి తొందరపాటు కారణంగా వాహనదారులు రోడ్డు నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడటం, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

భద్రత పెంచుకో - ఆనందం పంచుకో

ప్రభుత్వ ఉత్తర్వు నెం. 88, తేది: 7-7-2008 ప్రకారం ప్రతి పాఠశాల యాజమాన్యాలు ఆటస్థల సదుపాయాన్ని కల్పించాలి. మరియు ప్రభుత్వ ఉత్తర్వు నెం. 86, తేది: 3-3-2006 ప్రకారం పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలు, తమ సంస్థ నిర్మాణ స్థలంలో పార్కింగ్ కొరకు జి. హెచ్.ఎం.సి. పరిధిలో 30 శాతం మరియు ఇతర మున్సిపాలిటీలో 20 శాతం కేటాయించాలి.

## పార్కింగ్‌లో ఎదుర్కొనే సమస్యలు



- 'నో' పార్కింగ్ అని బోర్డు ఉన్న స్థలంలో వాహనాలను నిలుపటం వల్ల సమస్యలు ఉత్పన్నం అవుతాయి, పోలీసులు జరిమానా వేస్తారు.
- రోడ్డుపైన పార్కింగ్ చేయటం వల్ల అదే రోడ్డుపై ప్రయాణించే వారికి ఇబ్బంది కలుగుతుంది. ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉంది. అలాగే మన వాహనానికి ఇతర వాహనాలు తాకి ప్రమాదానికి లేదా మన వాహనం పాడవటానికి అవకాశం ఉంది.
- తరచుగా వాహనదారులు ఇష్టానుసారంగా తమ వాహనాలను పార్క్ చేయటం వల్ల ఇతర వాహనదారులు తమ వాహనాలను తీసుకునే వీలులేక ఇబ్బంది పడతారు. అది కొన్నిసార్లు గొడవలకు దారితీస్తుంది.

## పార్కింగ్‌లోని రకాలు

**మీకు తెలుసా?**

**రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం ద్విచక్ర వాహనాల వల్లనే సంభవిస్తున్నాయి. 2015లో 31.5% ప్రమాదాలు ద్విచక్ర వాహనాల వల్ల సంభవించాయి.**

**వాహనాలతో ఆటలాడటం - ప్రాణాలతో చెలగాటం**

## 1. వీధుల్లో పార్కింగ్ (On street parking)

పార్కింగ్ ప్రాంతం లేనప్పుడు వీధుల్లో రోడ్డుపైన ఒక ప్రక్కగా పార్కింగ్ చేయడాన్ని వీధుల్లో పార్కింగ్ అంటారు.



## 2. వీధుల్లో కాని పార్కింగ్ (Off street parking)

వీధుల్లో కాకుండా పార్కింగ్‌కు నిర్దేశింపబడిన ప్రాంతంలో పార్కింగ్ చేయడాన్ని ఆఫ్ స్ట్రీట్ పార్కింగ్ అని అంటారు. ఇది సాధారణంగా వాణిజ్య ప్రాంతాల్లో ఉంటాయి.




**మీకు తెలుసా?**

భారత దేశంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రతీ సంవత్సరం జనవరి నెలలో జరుపుకుంటారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించి అనేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తారు.

భద్రత నియమాలు పాటించు - జీవన ప్రమాణాన్ని పెంచు

### 3. సమాంతర పార్కింగ్ (Parallel parking)

రోడ్డు యొక్క పొడవును బట్టి వాహనాలు వాహనాలు వెనుకకు తీసుకోలేని పార్కింగ్‌ను సమాంతరం పార్కింగ్ అంటారు. అన్ని పార్కింగ్‌లకన్నా ఇది చాలా సురక్షితమైన పార్కింగ్. అయితే ఈ పార్కింగ్ విధానంలో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేయడానికి అవకాశం ఉండదు.




### 4. కోణీయ పార్కింగ్ (Angular parking)

(అ) $30^0$ పార్కింగ్: రోడ్డు విశాలతను బట్టి $30^0$ కోణంలో పార్కింగ్ చేసే విధానం. ఇందులో సమాంతర పార్కింగ్ కంటే ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేయడానికి అవకాశం ఉంది.

(ఆ) $45^0$ పార్కింగ్: రోడ్డు యొక్క దిశను బట్టి $45^0$ కోణంలో వాహనాలను పార్కింగ్ చేసే విధానం. ఇందులో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేయడానికి అవకాశం ఉంది.

(ఇ) $60^0$ పార్కింగ్: రోడ్డు యొక్క దిశను బట్టి $60^0$ కోణంలో వాహనాలను పార్కింగ్ చేసే విధానం. ఇందులో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేయడానికి అవకాశం ఉంది.


**మీకు తెలుసా?**

మోటారు సైకిల్, స్కూటర్ వంటి ద్విచక్ర వాహనాలను నడిపే వారు ధరించే హెల్మెట్‌ను డాక్టర్ ఎడిక్ గార్డ్‌నర్ రూపొందించారు.

**భద్రతపై మనసు పెట్టు - ప్రమాదాలను అరికట్టు**

## 5. లంబకోణ పార్కింగ్ (Perpendicular parking)

రోడ్డు యొక్క దిశను బట్టి $90^0$ కోణంలో వాహనాలను పార్కింగ్ చేసే విధానం. ఈ పార్కింగ్ విధానంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్నట్లయితే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉంది.




**మీకు తెలుసా?**

స్కూలు బస్సులు పసుపు రంగును కలిగి ఉండటానికి కారణం ఇతర రంగుల కన్నా పసుపు రంగు పరిధీయ దృష్టిలో సులభంగా గుర్తింపబడుతుంది.

భద్రత పాటిస్తే సుమాంజలి - భద్రత లోపిస్తే భాష్పాంజలి

## 6. బహుళస్థాయి పార్కింగ్ (Multi level parking)

ఈ పార్కింగ్ విధానం ప్రత్యేకంగా ఆటోమొబైల్ కంపెనీలలో ఉంటుంది. పార్కింగ్‌కు వివిధ రకాలైన వివిధ రకాల అంతస్థులు ఉంటాయి. ప్రతి అంతస్థులో అనేక వాహనాలను పార్కింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది.



### వాహనాన్ని పార్కింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- 'నో' పార్కింగ్ బోర్డు ఉన్న దగ్గర వాహనాన్ని నిలుపరాదు.
- పార్కింగ్‌కు నిర్దేశించిన స్థలంలోనే పార్కింగ్ చేయాలి.
- రోడ్డు ప్రక్కన పార్కింగ్ చేయవలసి వచ్చినప్పుడు పార్కింగ్ ఇండికేటర్స్‌ను ఉపయోగించాలి.
- పార్కింగ్ చేసే చోటును నిశితంగా గమనించిన తరువాతే పార్కింగ్ చేయాలి.
- మన వాహనాన్ని పార్క్ చేసేటప్పుడు తిరిగి తీయాల్సి వచ్చినప్పుడు మనకు, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉండాలి.
- మన వాహనాన్ని ఖాళీ స్థలంలో మనము ముందుగా పార్క్ చేస్తున్నప్పుడు పద్ధతిగా ఒక పక్కకు పార్క్ చేయాలి.
- మనం పార్కింగ్ చేసే పద్ధతి వల్ల ఎక్కువ స్థలం వృథా కాకుండా చూడాలి. దీనివల్ల ఇంకా ఎక్కువ వాహనాలు పార్క్ చేసే అవకాశం ఉంటుంది.

- వాహనాన్ని పార్క్ చేసేటప్పుడు ఏకాగ్రతతో చేయాలి తప్ప సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ లేదా ఇతరులతో మాట్లాడుతూ పార్క్ చేయకూడదు.
- వాహనాన్ని ఫుట్‌పాత్‌పైన పార్క్ చేయకూడదు.
- ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో వాహనాన్ని పార్క్ చేయరాదు.
- బస్టాండ్స్ లేదా బస్‌బేకు దగ్గరలో వాహనాలను నిలుపరాదు.
- ప్రజలు ఎక్కువగా ప్రవేశించే హెూటల్స్, సినిమా హాల్స్, హాస్పిటల్స్ మొదలైన వాటి ప్రవేశ ద్వారాల ముందు వాహనాన్ని నిలుపరాదు.
- రోడ్డ మూల మలుపు దగ్గర వాహనాలను నిలుపరాదు.

## హైవే రోడ్డుపై వాహనాన్ని పార్క్ చేయాల్సివస్తే



- అత్యవసరంగా రోడ్డుపై వాహనాన్ని నిలుపాల్సి వస్తే, చాలా తక్కువ సమయం ఆపి, త్వరగా ముందుకు కదలాలి.
- వాహనాన్ని రోడ్డు పక్కకు ఆపాలనుకుంటున్నవారు వెనుక నుంచి వచ్చే వాహనాలకు ఎడమ ఇండికేటర్ ద్వారా తెలియజేయాలి.

- వాహనాన్ని రోడ్డుకు ఎడమ అంచున మాత్రమే నిలుపాలి. ఉంచినంత సేపు పార్కింగ్ లైట్స్ వేసి ఉంచాలి.
- వాహనాన్ని నిలిపినపుడు హ్యాండ్ బ్రేక్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలి.
- ముందు ఉన్న వాహనానికి తగినంత స్థలం వదలి పార్క్ చేయాలి.

## పార్కింగ్ గుర్తులు









- పార్కింగ్‌కు సంబంధించి చాలా గుర్తులు ఉన్నాయి. ఇందులో రెండు రకాలు. మొదటి రకం ఏం చేయకూడదో తెలిపేవి. రెండో రకం ఏం చేయాలో తెలిపేవి.
- వాహనాన్ని నిలుపకూడని ప్రదేశం అని గుర్తించాలి.
- వాహనాన్ని నిలిపే ప్రదేశం అని గుర్తించాలి.

# 7 ట్రాఫిక్ నిర్వహణ (Traffic Managment)

స్కూలు యాజమాన్యాలు ట్రాఫిక్ క్రమబద్దీకరణను స్కూళ్ల వద్ద చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రత్యేకంగా పాఠశాలకు విద్యార్థులను వదిలి పెట్టేటప్పుడు మరియు తీసుకువెళ్ళే సమయంలో శ్రద్ధ వహించాలి. ప్రతి రోజు విద్యార్థులను పాఠశాలకు తీసుకువచ్చే సమయం మరియు ఇంటికి తీసుకువెళ్ళే సమయంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడి, విద్యార్థులకు ప్రమాదాలు మరియు గాలి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉంది. నడక వలన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు. మరియు మారుతున్న పరిసరాలు, సమాజం పట్ల ఒక అవగాహన ఏర్పడుతుంది.

అధిక ట్రాఫిక్ రద్దీ వలన ఏర్పడే ప్రమాదాలను, ఒడిదొడుకులను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు తమ పిల్లల రక్షణ కొరకు శ్రద్ధ వహించాలి. స్కూలు పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ నిర్వహణ అనేది సంబంధిత స్కూల్ యాజమాన్యాల బాధ్యత. స్కూల్ పరిసరాలలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి స్కూల్ యాజమాన్యాలకు ఈ క్రింది అంశాలు దోహదపడతాయి.

### 1. స్కూళ్ళ వద్ద ట్రాఫిక్ నియంత్రణ

వాహనాల రద్దీని నివారించడానికి ఉత్తమమైన మార్గంగా విద్యార్థులను, తల్లిదండ్రులను మరియు సిబ్బందిని ఈ క్రింది విధంగా స్కూల్‌కు రావడాన్ని ప్రోత్సహించాలి.



☛ నడక



☛ సైక్లింగ్

**అనాలోచితంగా వాహనాన్ని నడపకు - ఆపదలను కొని తెచ్చుకోకు**

☛ ప్రజా రవాణా సదుపాయాలను ఉపయోగించడం (ఆర్.టి.సి.)







☛ స్కూల్ బస్సు

☛ కారు షేరింగ్ చేసుకోవడం




**మీకు తెలుసా?**

అంబులెన్స్‌ల ముందు భాగంలో ఆంగ్లంలో అంబులెన్స్ పదం యొక్క అక్షరాలు తిరగేసి రాస్తారు. ఎందుకంటే ముందు వెళుతున్న వాహనం యొక్క వెనుక చూపే అద్దం (rear view mirror) సైడ్ మిర్రర్‌లలో ఆ పదం అక్షరాలను సరైన విధంగానూ, పెద్దవి గానూ చూపిస్తుంది.

యువత మేలుకో --మద్యం మానుకో - ప్రాణాలు నిలుపుకో

## 2. ప్రయాణ ప్రణాళికను రూపొందించడం

ట్రాఫిక్ నియంత్రణకు స్కూల్ యాజమాన్యాలు క్రింది అంశాలపై దృష్టిసారించే విధంగా ఒక ప్రయాణ ప్రణాళికను రూపొందించుకోవాలి.

- స్కూల్ పరిసర ప్రాంతాలలో వాహనాల రాకపోకలు ఎలా ఉన్నాయి?
- వాహనాలను పార్కింగ్ చేసే స్థలం
- పాదచారులకు సురక్షిత మార్గాలు ఏర్పాటు
- ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రోడ్డుపై నియంత్రణ రేఖలు
- ట్రాఫిక్ వాలంటీర్లను నియమించడం
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారాలకు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల కమిటీలను ఏర్పాటు చేయడం
- ట్రాఫిక్ సమస్య గురించి ఆలోచించే విధంగా ప్రయాణ ప్రణాళిక రూపకల్పనలో సమాజం పాల్గొనేలా చేయాలి.

### ట్రాఫిక్ సమస్యలకు సంబంధిత అంశాలను గుర్తించడం

ప్రయాణ ప్రణాళికను పూర్తి చేయడానికి ముందు స్కూల్ యాజమాన్యాలు క్రింది అంశాలను పరిశీలించాలి.

- స్థానిక అధికారుల సహాయంతో వాహనాల వేగ నియంత్రణ కొరకు స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం.
- స్కూల్ విద్యార్థులు వాహనాల నుండి దిగే స్థలాన్ని, తిరిగి వెళ్ళే స్థలాన్ని సూచించే సూచికలు ఏర్పాటు చేయడం. వాహనాల రద్దీ నియంత్రణ కొరకు స్కూల్ లోనికి వచ్చే వాహనాలకు మరియు బయటకు వెళ్ళే వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడం.

**మీకు తెలుసా?**

'నో హాంకింగ్ జోన్'లో (హారన్ మ్రోగించడం) హారన్ ఉపయోగించకూడదు. ఆసుపత్రుల వద్ద, న్యాయస్థానాల వద్ద, పాఠశాలల వద్ద, ప్రార్థనా స్థలాల వద్ద, ముఖ్య ప్రభుత్వ కార్యాలయాల వద్ద నో హాంకింగ్ జోన్ బోర్డులు కనిపిస్తాయి.

**అతివేగం - ప్రమాదాలకు మూలం**

- స్కూల్ ప్రారంభ మరియు మూసివేసే సమయాల్లో ట్రాఫిక్ వాలంటీర్లు నియమించడం
- ద్విచక్ర వాహనాలకు, ఆటోలకు, కార్లకు, స్కూల్ బస్సులకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడం
- స్కూళ్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో స్కూళ్ళ పని వేళలో మార్పులు చేయడం
- ట్రాఫిక్ రద్దీ నియంత్రనకు పూర్వ ప్రాథమిక, ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలకు వేర్వేరు సమయాలు రూపొందించడం.
- పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల మరియు టీచర్ల సంఘం ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా సమావేశాలు నిర్వహించాలి.
- స్కూల్ సిబ్బంది మరియు ట్రాఫిక్ వాలంటీర్ల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలు వ్యాయామ ఉపాధ్యాయునికి అప్పగించాలి.

## స్కూలుకు విద్యార్థులను చేరవేసే మరియు తీసుకువెళ్ళే పద్దతి కొరకు ప్రణాళికను రూపొందించడం

ప్రయాణ ప్రణాళికలో భాగంగా విద్యార్థులను స్కూల్‌కు చేరవేసే సమయంలో మరియు తీసుకువెల్లే సమయంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రత్యేక పద్ధతి పాటించాలి. పట్టణ ప్రాంతాలలో గల స్కూల్ పరిసరాలలో రద్దీ సమయాలలో ట్రాఫిక్ నియంత్రణను చేపట్టాలి. లేనిచో వాహనదారులు తమ వాహానాలను అక్రమ పద్దతిలో నిలుపుతారు. ఉదాహరణకు:

- రెండవ వరుసలో కూడా వాహనాలను నిలపడం
- పసుపు గీతలపై పార్కింగ్

**మీకు తెలుసా?**

**జీబ్రా క్రాసింగ్ అను పదాన్ని 1948లో బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుడు జేమ్స్ కలఘూన్ మొదటిసారిగా ప్రయోగించాడు.**

వేగం వద్దు - ప్రాణాలేముద్దు

- రహదారికి అడ్డంగా వాహనాల నిలుపుదల
- పాదచారుల దారికి అడ్డుగా పార్కింగ్

ఇలాంటి పద్ధతులు ప్రమాదకరం మరియు రోడ్డుపై వేళ్ళేవారికి ఇబ్బంది కలిగించే విధంగా ఉంటాయి.

## ప్రణాళికలో చేర్చాల్సిన అంశాలు

- పాదచారులకు ప్రత్యేకంగా దారి ఏర్పరచడం
- కార్లు, పాదచారుల మార్గాలనుండి బస్సుల మార్గాన్ని విడదీసి ప్రత్యేక ప్రవేశమార్గాన్ని బస్సుల కొరకు ఏర్పాటు
- స్కూల్ పిల్లలను దించడానికి ప్రత్యేక ప్రదేశాన్ని ఏర్పాటు చేయడం
- ట్రాఫిక్ నియంత్రన కొరకు కీలక ప్రాంతాలలో వాలంటీర్లను నియమించడం
- స్కూల్ పిల్లలు అందరికి ఒకే సమయం కాకుండా వివిధ సమయాల్లో స్కూల్ పని వేళలు రూపొందించుకోవాలి.
- టూ వే సాధ్యం కానీ చోట వన్ వే పాటించాలి.
- విద్యార్థులను స్కూల్‌లో దించడానికి మరియు తీసుకువెళ్ళడానికి స్థలం లేకపోతే యాజమాన్యం సమీప వీధిలో స్థలం కొరకు స్థానిక అధికారులను సంప్రదించాలి.

**మీకు తెలుసా?**

ప్రధాన రహదారులపై విశాలమైన డివైడర్‌ల మధ్య మొక్కలను పెంచుతారు. ఎందుకంటే ఎదురుగా వస్తున్న వాహనాల నుండి వచ్చే ప్రకాశవంతమైన వెలుతురు కారణంగా వాహన చోదకులు తమ దృష్టి మరల్చకుండా ఉంటుంది. పైగా మొక్కల పెంపకం పర్యావరణ కాలుష్యంను తగ్గించుటకు ఉపయోగపడుతుంది.

**రోడ్డును కాపాడితే అది నిన్ను కాపాడుతుంది**

## విద్యార్థులకు రవాణా సౌకర్యం

- విద్యార్థులు స్కూల్‌కు వెళ్ళడానికి వివిధ రకాల రవాణా వ్యవస్థలు, మార్గాలు ఉన్నాయి.
- పాఠశాల రవాణా వ్యవస్థలో భాగంగా విద్యార్థులు తమంతటి తాముగా నడిచి రావడము లేదా సైకిల్‌పై రావడం లేదా కుటుంబ సభ్యులు లేదా సహాయకులు వెంట రావడం లేదా బస్సులో గానీ, టాక్సీలో గానీ వచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యార్థులను వివిధ ప్రాంతాల నుండి తీసుకురావడానికి మరియు దింపడానికి బస్సు సౌకర్యం కొరకు స్కూల్ యాజమాన్యాలు ప్రణాళిక రూపొందించుకోవాలి.
- స్థానిక రవాణాశాఖ అధికారుల సహకారంతో స్కూల్ అధికారులు మరియు తల్లిదండ్రుల సంఘం ఆధ్వర్యంలో రవాణా వ్యవస్థపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి.
- యాజమాన్యాలు సురక్షిత రవాణా మార్గాల పటాలను రూపొందించుకోవాలి.
- రవాణా వ్యవస్థలో విద్యార్థులను, తల్లిదండ్రులను, స్కూల్ అధికారులను, రవాణా/ట్రాఫిక్ అధికారులను భాగస్తులను చేయడం.
- విద్యార్థుల రవాణా సౌకర్యం కొరకు సురక్షితమైన మరియు రక్షణాత్మకమైన మార్గాల ప్రణాళికలను రూపొందించుకోవడం.

**మీకు తెలుసా?**

**రోడ్డు ప్రమాదాల వల్ల మన దేశ జాతీయాదాయం సంవత్సరానికి 3% హరించుకుపోతోంది.**

**రోడ్డు నియమాలు పాటించడం మన ప్రథమ కర్తవ్యం**

- నడక మరియు సైకిల్ ప్రయాణాలకు గల అవాంతరాలను గుర్తించడానికి సర్వే నిర్వహించడం.
- స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల కొరకు రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలను అమలులోకి తీసుకురావడం.
- క్రింది పద్ధతులను అభివృద్ధిపరచడం ద్వారా చక్కటి స్కూల్ రవాణా వ్యవస్థ నిర్వహణను చేపట్టవచ్చును.

## హాస్పిటల్ జోన్



హాస్పిటల్ పరిసర ప్రాంతాలలో రోగులను వారి సహాయకులను (ఇబ్బంది పెట్టేవిధంగా) అసౌకర్యానికి గురిచేసేటట్లు వాహనాలు నడుపరాదు

**ఉదా:-** అతివేగం, ఎక్కువగా హారన్లు మోగించడం, అంబులెన్స్‌లకు దారి ఇవ్వకపోవడం మొదలైనవి.




**మీకు తెలుసా?**

ప్రపంచంలో రోడ్డు ప్రమాదాల ద్వారా అధికంగా మరణాలు సంభవిస్తున్న దేశాలలో భారతదేశం ఒకటి. మనదేశంలో సగటున దాదాపు 400 మంది ప్రతి రోజూ రహదారి ప్రమాదాల వల్ల మరణిస్తున్నారు. అయితే ప్రపంచ రోడ్డు గణాంకాలు 2015 ప్రకారం రష్యా ప్రధమ స్థానంలో ఉండగా, భారత్ ద్వితీయ స్థానంలో ఉంది.

మెల్లగా నడుపు - ప్రాణాలు నిలుపు

# 8 రోడ్డు ప్రమాద కారణాలు
# (Causes of road accidents)

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే దేశాలలో మన భారతదేశం కూడా ఒకటి. ప్రతి సంవత్సరం 1,30,000 పైగా ప్రజలు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు చాలా కారణాలు కలవు. అందులో చాలా వరకు మానవ తప్పిదాలే.

ప్రభుత్వ గణాంకాల ప్రకారం చాలా రోడ్డు ప్రమాదాలలో పిల్లలే బాధితులవుతున్నారు. మిగతా వయస్సు వారి కంటే పిల్లలకే ఎక్కువ ప్రమాదం పొంచి ఉంది.

2014 సం॥లో భారతదేశంలో సంభవించిన రోడ్డు ప్రమాదాలు

- ప్రతి గంటకు మరణించేవారి సంఖ్య = 16
- రోడ్డు ప్రమాదాల కారణంగా 1.40 లక్షల మంది మరణించారు.
- 4.80 లక్షల మంది గాయాలపాలయ్యారు.

## రోడ్డు ప్రమాదాలు – కారణాలు

### I. డ్రైవర్ యొక్క తప్పిదం

**1. చోదకుని ఏకాగ్రతకు భంగం కలిగించడం:–** మొబైల్ ఫోన్‌లో మాట్లాడటం మరియు తోటి ప్రయాణీకులతో మాట్లాడటం వల్ల చోదకుని ఏకాగ్రతకు భంగం కలిగి దృష్టి వాహనాల కదలికపై ఉండక ప్రమాదానికి దారి తీస్తుంది.





**2. వాహనం అతి వేగంగా నడపడం:–** వాహనం నిర్ధారిత వేగం కన్నా అతి వేగంగా నడిపితే అదుపు తప్పి పడిపోవడము లేదా ఇతర వాహనాలను ఢీ కొనడం జరుగుతుంది. వాహన వేగం పెరగడంతో ప్రమాదాలు పెరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. దీని వలన చోదకునితో సహా ఇతరులకు కూడా హానికరం.

**3. మద్యం సేవించి వాహనము నడపడం:–** మద్యం సేవించి చోదకుడు వాహనాన్ని నడిపితే అతడు తనపై నియంత్రణ కోల్పోయి వాహనాన్ని ఇతరులకు, ఇతర వాహనాలకు లేదా డివైడర్‌కు ఢీ కొని తీవ్ర గాయాలు పొందుట లేదా ప్రాణాలను కోల్పోవుట లేదా ఇతరులు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది.






**4. సిగ్నల్స్‌ను పాటించకపోవడం:–** కొంత మంది డ్రైవర్లు సిగ్నల్ దగ్గర రెడ్ లైట్ ఉన్నప్పటికీ వాహనాలను నిలుపరు. రోడ్డు సిగ్నల్స్‌ను పాటించక పోవడం ఘోరమైన ప్రమాదాలకు దారి తీస్తుంది. దీంతో ప్రతి సంవత్సరం అనేకం మంది ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే STOP అనే బోర్డు ఉన్న చోట రెండువైపులా చూసి వాహనాన్ని నడపాలి.

**5. చోదకుల అలసట:–** చోదకులు నిరంతరంగా వాహనాన్ని నడిపి అలసటకు గురౌతారు. వారికి సరిగా నిద్ర లేకపోవడం వల్ల వాహనం అదుపు తప్పి ప్రమాదాలకు దారి తీస్తుంది.

**రోడ్డు నియమాలు పాటించడం మనకూ మన చుట్టూ ఉన్నవారికి శ్రేయోదాయకం**

**6. చోదకుని మానసిక మరియు శారీరక స్థితి:-** చోదకుని దృష్టి లోపాలు, శారీరక వైఫల్యాలు మరియు మానసిక స్థితి సరిగా లేకపోతే వాహనాన్ని నడిపే సామర్థ్యాన్ని కోల్పోతారు. అందువల్ల ప్రమాదాలు జరుగుతాయి.

**7. రాత్రి పూట వాహనాలు నడపడం:-** రాత్రి పూట వెలుగు తక్కువగా ఉండడం, అన్ని రోడ్లపై వీధి దీపాలు సరిగి లేకపోవడం వల్ల వాహనాల రాక పోకలు సరిగా కనిపించవు. ఇందుకే రాత్రివేళల్లో చాలా ప్రమాదాలు జరుగుతాయి.





**8. వాహన సామర్థ్యానికి మించి సరుకులు వేయడం, పరిమితికి మించి ప్రయాణికులు ఉండటం (overloading) :-** వాహనదారులు వాహన సామర్ధ్యానికి మించి సరుకులు వేయడం వల్ల వాహనం అదుపు తప్పి, అందులో ఉన్న సరుకులు క్రింద పడి ఇతర వాహనదారులకు ఇబ్బంది/ప్రమాదం కలిగిస్తాయి. వాహనంపై పరిమితికి మించి ప్రయాణికులు ఉండటం వలన ప్రమాదాలు జరుగుతాయి.



**9. నిద్రమత్తు:-** రాత్రి వేళలో సరైన ఆహారం, నిద్ర లేకుండా వాహనాన్ని నడపడం వలన కూడ ప్రమాదానికి కారణమవుతుంది. పొగ మంచు కారణంగా కూడా ప్రమాదాలు జరుగుతుంటాయి.



ట్రాఫిక్ సిగ్నల్‌ను పాటించు - భద్రతగా జీవించు

**10. రక్షక కవచాలు ధరించకపోవడం:-** హెల్‌మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల చోదకుడు, మరియు తోటి ప్రయాణికులు ప్రమాదం జరిగినప్పుడు తీవ్ర గాయాలు లేదా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.





**11. ముందున్న వాహనం దాటి పోవడం (overtaking):-** చోదకుడు తన ముందున్న వాహనాన్ని సరిగా సంకేతాలు ఇవ్వకుండా దాటడం మరియు వాహనాన్ని ఎడమ వైపు నుండి దాటడం వల్ల చాలా ప్రమాదాలకు దారితీస్తుంది.

**12. అనుకరించడం:-** సినిమాల ప్రభావంతో కూడా తమ హీరోలు చేసిన వివిధ రకాల ఫీట్స్ చేసి ప్రమాదాలకు గురౌతుంటారు.





**13. సెల్‌ఫోన్:-** సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ చుట్టు ప్రక్కల గమనించకుండా వాహనాన్ని నడపడం కూడా ప్రమాదాలకు కారణమవుతుంది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ రోడ్డు దాటడం, రైల్వే ట్రాక్‌ను దాటటం వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి.



**14. టర్నింగులు (Turnings):-** మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపులను వాహనదారులు సరిగా అంచనా వేయలేకపోవడం, ఇతర వాహనాలను అధిగమించే ప్రయత్నంలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి.




**15. రోడ్లపై రేసులు:-** రోడ్లపై యువకుల రేసుల వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి.



**16. జంతువులు:-** వాహనాలకు అడ్డంగా కుక్కలు, గొర్రెలు, ఆవులు రోడ్డుపైకి రావడం వలన ప్రమాదానికి గురౌతున్నారు.

**17. తప్పుడు దారి (Wrong Route):-** నిబంధనలకు విరుద్ధంగా పట్టణాలలో, నగరాలలో మరియు హైవేలలో రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం వలన ప్రమాదాలకు గురౌతున్నారు.

## II. బాధితుని యొక్క తప్పిదం



**1. ఇష్టానుసారంగా రోడ్డు దాటడం:-** పాదచారులు జీబ్రాక్రాసింగ్ దగ్గర కాకుండా ఎక్కడ పడితే అక్కడ రోడ్డు మధ్యలో ఇష్టానుసారంగా రోడ్డు దాటితే వాహనాల వేగం నియంత్రించడం కష్టతరమవుతుంది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ రోడ్డు దాటితే ప్రమాదాలకు దారి తీస్తుంది.



2. **మైనర్లు వాహనం నడపడం:-** మైనర్లకు (18 సం॥ లోపు వారు), మానసిక పరిపక్వత తక్కువ. వారు వాహనం నడుపు ఉత్సాహంలో విచక్షణ జ్ఞానం కోల్పోతారు. దీని వలన ప్రమాదాలు జరుగుతాయి.



3. **రోడ్డుపై ఆటలాడడం:-** తరచుగా పిల్లలు రోడ్డుపై క్రికెట్, గిల్లిదండ వంటి ఆటలు ఆడడం వల్ల ప్రయాణీకులు మరియు వాహనదారులు ప్రమాదాలకు గురౌతారు.

## III. వాహనం యొక్క స్థితి



- టైర్లు సరిగ్గా లేకపోవడం, ప్రయాణించేటప్పుడు టైర్లు పగిలిపోవడం
- వాహనాల్లో ఉపయోగించే విడిభాగాలు సమర్థవంతమైనవి అమర్చకపోవడం
- బ్రేకులు సరిగా పనిచేయకపోవడం
- వైపర్‌లు పనిచేయకపోవడం



## IV. రోడ్డు యొక్క దుస్థితి







- రోడ్డు యొక్క నిర్మాణం సరిగ్గా లేకపోవడం
- రోడ్లు పాడై గుంతలు ఎక్కువగా ఉండడం
- మ్యాన్‌హోల్స్ వలన
- ప్రమాదకరమైన మలుపుల వలన

### 5. వాతావరణ పరిస్థితి

- పొగమంచు: పొగమంచు వలన ముందు ప్రయాణిస్తున్న వాహనాలు వాహనదారుడికి కనబడకపోవడం వలన ప్రమాదాలు జరుగుతుంటాయి.



- వర్షం: వర్షాల మూలంగా చెట్లు పడిపోవడం, ఎలక్ట్రిక్ స్తంభాలు పడిపోవడం, మ్యాన్‌హోల్స్ తెరవడం, వర్షపు నీటిలో వాహనం జారడం వలన ప్రమాదాలు జరుగుతుంటాయి.



**పట్టిక: 2015 సం॥ తెలంగాణలో వివిధ రకాలైన వాహనాల ద్వారా జరిగిన ప్రమాదాల సమాచారం**

| క్ర.సం. | వాహనం | ప్రమాదాల సంఖ్య | మరణాల సంఖ్య | గాయాలపాలైన వారి సంఖ్య |
|---|---|---|---|---|
| 1. | బస్సులు | 1417 | 429 | 1764 |
| 2. | ట్రాక్టర్లు | 888 | 383 | 1197 |
| 3. | లారీలు | 2683 | 1145 | 2544 |
| 4. | తేలికపాటి మోటర్ వాహనం | 4189 | 1122 | 5028 |
| 5. | ద్విచక్ర వాహనాలు | 6744 | 2061 | 6368 |
| 6. | త్రిచక్ర వాహనాలు | 2394 | 578 | 3530 |
| 7. | పాదచారులు, ఇతరులు | 2937 | 1392 | 2517 |
| మొత్తం | | 21252 | 7110 | 22948 |

# 9 భద్రతా చర్యలు (Safety measures)

ప్రజల సౌకర్యార్థం కొన్ని రోడ్డు నియమాలు రూపొందించబడ్డాయి. వీటిని కేవలం వాహనాలు నడిపే చోదకులే కాకుండా పాదచారులు మరియు సైకిల్ నడిపే వారందరు పాటించాలి. రోడ్డు ఉపయోగించే వారికి ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు ఇతర రోడ్డు మార్కింగ్స్ నిశ్శబ్దంగా సూచనలిస్తాయి. వీటిని అందరు అర్థం చేసుకొని క్రమం తప్పకుండా అనుసరించాలి.

నాణ్యమైన రోడ్లు ప్రభుత్వం ఏర్పాటు చేయట్లేదని మనం ప్రభుత్వాన్ని నిందిస్తే ప్రయోజనమేమి ఉండదు. రోడ్డు నియమాలు ఉన్నవి ప్రజలందరికి కాని వాటిని అమలు పరుస్తున్న అధికారులకే కాదు. మనం ఈ నియమాలను పాటిస్తూ మన ప్రాణాలను మరియు ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలి.

రోడ్డు ప్రమాదాలలో పిల్లల సంఖ్య ఎక్కువ ఉన్నందువల్ల చిన్న వయస్సు నుండే వారిలో రోడ్డు నియమాలను పాటించాల్సిన ఆవశ్యకత గురించి జ్ఞానం పెంపొందించటం అవసరం. అది వారి ఇల్లు మరియు పాఠశాల నుండే ప్రారంభం కావాలి. ఇది మన అందరి సమిష్టి బాధ్యత.

## సురక్షిత ప్రయాణానికి తీసుకోవలసిన జాగ్రత్తలు

**1. నిదానమే ప్రధానము:** ప్రయాణికులు తొందరపాటు పడకుండా ప్రయాణ సమయాన్ని ట్రాఫిక్‌ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయించుకోవాలి. తదనుగుణంగా వాహనాన్ని జాగ్రత్తగా నియమాలను పాటిస్తూ గమ్యాన్ని చేరుకోవాలి.

**మీకు తెలుసా?**

రోడ్డు భద్రత (Road Safety) అను పదాల్ని మొదటిసారిగా 1906 సం॥లో హెన్నీ, సి.పియర్సన్ తన 'రబ్బర్ టైర్స్ అండ్ ఆల్ ఎబౌట్ దెమ్' అను గ్రంథంలో ఉపయోగించారు.

**రోడ్డుమీద ఆటలాడకు - ప్రమాదాన్ని కొని తెచ్చుకోకు**

## పాదచారులు పాటించవలసినవి

- జాగ్రత్తగా రోడ్డుపై / ఫుట్‌పాత్‌పైనే నడవాలి. ఫుట్‌పాత్ లేని చోట కుడి ప్రక్కన నడవాలి.



## విద్యార్థులకు నేర్పించవలసినవి:

ఎ) ఆగుము, బి) చూడుము, సి) వినుము డి) ఆలోచించుము

**ఎ) ఆగుము:** రోడ్డు దాటే ముందు ఆగి చూడము.

**బి) చూడుము:** రోడ్డుకు రెండువైపులా ఒకసారి జాగ్రత్తగా చూడుము.

**సి) వినుము:** వాహన శబ్దాలను జాగ్రత్తగా వినుము.

**డి) ఆలోచించుము:** రోడ్డు దాటడం క్షేమమా కాదా అని ఆలోచించాలి.

- డివైడర్‌ను ఎప్పుడు దాటరాదు.
- ఎదుటి వాహన చోదకుడు మిమ్ములను గమనించాడో లేదో నిర్ధారించుకోవాలి.



- రోడ్డును జీబ్రా క్రాసింగ్ వద్దే దాటాలి.
- రోడ్డును అన్ని వాహనాలు ఆగి ఉన్నప్పుడు మాత్రమే పాదచారులకు సూచించే సూచిక ఆకుపచ్చ రంగులో ఉన్నప్పుడు మాత్రమే రోడ్డును దాటాలి.
- రోడ్డును దాటేటప్పుడు పెద్దవారి చేతిని పట్టుకుని మాత్రమే దాటాలి.
- వృద్ధులు, వికలాంగులు సహాయకులతో రోడ్డు దాటాలి.
- మలుపులలో రోడ్డును దాటకూడదు.
- రోడ్డు దాటేటప్పుడు, ఫోన్ మాట్లాడుతూ కానీ, మెస్సేజెస్ చదువుతూ గానీ, ఆటలు ఆడుతూ కానీ దాటకూడదు.

- ట్రాఫిక్ సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో రోడ్డు దాటేటప్పుడు ముందుగా కుడివైపు తరువాత ఎడమవైపు జాగ్రత్తగా గమనించి రోడ్డును దాటాలి.
- స్కూల్ ప్రాంతాల్లో రోడ్డును దాటే విద్యార్థులు అందరూ ఒకేసారి జతలుగా చేతులు పట్టుకొని వరుసగా 'క్యూ' పద్ధతిలో దాటాలి.
- రాత్రిపూట రోడ్డుపై నడిచేటప్పుడు ప్రకాశవంతమైన దుస్తులు ధరించాలి.
- రోడ్డుపై అడ్డదిడ్డంగా పరిగెత్తకూడదు.
- పశువులను, పెంపుడు జంతువులను రోడ్డుపై వదిలేయడం, కట్టివేయడం చేయరాదు.
- మనం రోడ్లపై ఆటలు ఆడకూడదు. ఆటలు నిర్దేశిత ఆట స్థలాల్లోనే ఆడుకోవాలి.

## సైకిల్‌పై ప్రయాణిస్తునప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు



- సైకిల్ మంచి కండీషన్‌లో ఉండాలి.
- ఎక్కువ బరువు వేసి సైకిల్ నడపరాదు.
- సైకిల్ నడపటం మెయిన్ రోడ్డుపై నేర్చుకోరాదు.
- సైకిల్ హ్యాండిల్ (handle) ను రెండు చేతులతో పట్టుకోవాలి.
- రెడ్ రిఫ్లెక్టర్ (Red Reflector)ను సైకిల్ వెనుక అమర్చుకోవాలి.
- సైకిల్‌ను రోడ్డుకు ఎడమ పక్కననే నడపాలి.
- మలుపుల దగ్గర చేతి సంకేతాలు ఉపయోగించాలి.

**అమ్మానాన్నలకు నువ్వంటే ఇష్టం - భద్రత పాటించకుండా వారికి కలిగించకు కష్టం**

## మోటర్ బైక్ నడుపు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

- చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఇతర కావలసిన ధృవీకరణ పత్రములు పొంది ఉండాలి.
- రోడ్డుకు తగ్గ నిర్ణీత వేగాన్ని అనుసరించాలి.
- హెల్మెట్ ధరించాలి.
- వాహనం సరైన కండీషన్‌లో ఉండేటట్లు చూడాలి (Proper Maintenance).



- మలుపుల దగ్గర సరైన సంకేతాలు (Indicators) ఇవ్వాలి.
- మోటర్ బైక్‌పై ఇద్దరే ప్రయాణించాలి.
- కుడివైపు నుండే ముందున్న వాహనానికి సంకేతమిచ్చి దాటాలి.
- అన్ని రోడ్డు నియమాలను పాటించాలి.

## ఆటోరిక్షా నడుపు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు



రాష్ట్రంలో ప్రత్యేకంగా హైదరాబాద్‌తో సహా వివిధ పట్టణాలు మరియు కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఆటోను స్కూలు పిల్లల ప్రయాణ సాధనంగా ఉపయోగిస్తున్నారు. ఇది కొంత చవకైనది. ఎక్కువగా మధ్య, ఎగువ తరగతి కుటుంబాలు తమ పిల్లల్ని స్కూలుకు పంపడానికి ఆటోరిక్షాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. విద్యార్థుల ప్రయాణ సాధనంగా ఆటో వినియోగం

**రోడ్డు భద్రతను పాటిద్దాం - ప్రయాణాన్ని ఆనందంగా ముగిద్దాం.**

పెరగడం వలన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రవాణాశాఖ ఆటోలలో సురక్షితమైన ప్రయాణం కొరకు కొన్ని నిబంధనలను రూపొందించడం జరిగింది. అవి:

- ✔ ఒక ఆటోలో 6గురు విద్యార్థులకంటే ఎక్కువ అనుమతించరాదు.
- ✔ విద్యార్థులను పాఠశాల వద్ద దింపడానికి, ఎక్కించడానికి ఆటోను స్కూలు అవరణలోకి తీసుకువెళ్ళాలి.

## కార్లు నడుపు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు



1. చోదకుడు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలి.
2. చోదకుడు రోడ్డుకు తగిన నిర్ణీత వేగాన్ని పాటించాలి.
3. చోదకుడు అన్ని ధృవీకరణ పత్రములు పొంది ఉండాలి.
4. వాహనం సరైన కండీషన్‌లో ఉండాలి.

### బస్సు ఎక్కే ముందు



1. బస్సు ఆగిన తరవాతే ఎక్కాలి.
2. మీ చేతిలో ఉన్న వస్తువులు కానీ, మీ దుస్తులు కానీ, ఎక్కడా ఇరుక్కుపోకుండా చూసుకోవాలి.

### బస్సులో ప్రయాణించేటప్పుడు

1. సరిగ్గా కూర్చొని ముందుకు చూస్తూ ఉండాలి.
2. మీ చేతులు / కాళ్ళు / తల బయటకు పెట్టకూడదు.
3. ఫుట్‌బోర్డ్‌పై నిల్చొని ప్రయాణం చేయరాదు.
4. బస్సులో అల్లరి చేసి చోదకుని ఏకాగ్రతకు భంగం కలిగించకూడదు.

### బస్సు దిగేటప్పుడు

1. బస్సు పూర్తిగా ఆగిన తరువాత దిగాలి.
2. బస్సు దిగేటప్పుడు నెమ్మదిగా తోపులాట లేకుండా దిగాలి.
3. బస్సు కింద పడిన వస్తువులను బస్సు వెళ్ళిన తరువాతే తీసుకోవాలి.

### స్కూల్ బస్సుల కొరకు తెలంగాణా ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు

- స్కూల్ బస్సులు పసుపు రంగులో ఉండాలి మరియు బస్సు ముందు వెనుక స్కూల్ బస్ అని తప్పనిసరిగా రాయాలి.
- పరిమితికి మించి విద్యార్థులను స్కూల్ బస్సులో ఎక్కించకూడదు మరియు విద్యార్థులను సీట్లలో ఇరుకుగా కూర్చోపెట్టరాదు.
- ప్రతి బస్సులో ప్రథమ చికిత్స బాక్స్ మరియు త్రాగు నీటి సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలి.
- అవసరమైన చోట్ల సీటు బెల్టులను బిగించాలి.

**మెల్లగా నడుపు - ప్రాణాలు నిలుపు**

- బస్సుకు ఇరువైపులా కనపడే విధంగా స్కూల్ పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెంబర్ రాయాలి.
- స్కూల్ బస్సు నడిపే డ్రైవరుకు సంబంధిత రంగంలో కనీసం 5 సంవత్సరముల అనుభవం కలిగి ఉండాలి. ఎలాంటి ట్రాఫిక్ ఉల్లంఘనకు సంబంధించిన కేసులు ఉండరాదు.
- ప్రతి స్కూల్ బస్సులో పిల్లలను బస్సు దింపడానికి, ఎక్కించడానికి మరియు సురక్షిత ప్రయాణం కొరకు ఒక సహాయకుడిని నియమించాలి.
- స్కూల్ యాజమాన్యం మరియు తల్లిదండ్రులు స్కూల్ బస్సును తనిఖీ చేసి దాని స్థితిని రిజిస్టర్‌లో నమోదు చేయాలి.
- వాహనంలో అత్యవసర ద్వారాన్ని ఏర్పాటు చేయాలి మరియు EMERGENCY EXIT అని పెద్ద అక్షరాలతో కనబడే విధంగా రాయాలి.
- ప్రతి బస్సులో అగ్నిమాపక పరికరం ఉండాలి.
- ప్రతి వాహనానికి పైన నాలుగు మూలలలో ఆరెంజ్ లైట్లను అమర్చాలి.
- సురక్షిత డోర్ లాకింగ్ సౌకర్యంతో పాటు బస్సు కిటికీలకు ఇనుప ఊచలు 31 సె.మీ ఖాళీ మించకుండా బిగించాలి.

## సాధారణ జాగ్రత్తలు

- వాహనదారులు మరియు తోటి ప్రయాణీకులు ప్రయాణిస్తున్న సమయంలో ఏకాగ్రత మరియు జాగ్రత్త వహించాలి.
- నిర్ణీత వేగాన్ని అనుసరించి వాహనము నడపాలి.
- ఏ వాహనంలో కానీ పరిమిత సంఖ్యలోనే ప్రయాణీకులు ప్రయాణించాలి.
- ఆరోగ్యం సరిగా ఉన్నప్పుడు మరియు అలసట లేనప్పుడే వాహనం నడపాలి.

- ట్రాఫిక్ సిగ్నల్స్‌ను మరియు నిబంధనలను తప్పకుండా పాటించాలి.



- అందరికి ట్రాఫిక్ సూచికల అవగాహన ఉండాలి.
- ప్రతి వాహనాన్ని నిర్ణీత బరువు మించకుండా సరుకులను లోడ్ చేసి నడపాలి.
- రాత్రి సమయంలో ఎదురుగుండా వచ్చే వాహనాలకు అసౌకర్యం కలిగించకుండా ఉండటానికి వాహనాల (head lights) హెడ్‌లైట్స్‌పై నుండి సగం వరకు నలుపు రంగుతో కవర్ చేయాలి.
- రోడ్లను సరిగా మరియు క్రమం తప్పకుండా మరమ్మత్తులు చేపట్టాలి.
- ప్రతికూల వాతావరణ స్థితిలో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి.
- ర్యాలీలు మరియు ఊరేగింపులు నిర్వహించుటకు అధికారుల అనుమతి పొందాలి.

# 10 తప్పనిసరిగా ఉండవలసిన పత్రాలు (Essential Documents)

**ఏదేని మోటారు వాహనమును నడపాలంటే కొన్ని పత్రాలు (డాక్యుమెంట్) తప్పనిసరిగా ఉండాలి.**

**Traffic Documents, Challans - License, Registration, Pollution Certificate, Insurance.**

వాటిలో ముఖ్యమైనవి:

1. డ్రైవింగ్ లైసెన్స్ (D.L)
2. వాహన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ (R.C)
3. కాలుష్య నియంత్రణ పత్రము (Pollution Under Control Certificate)
4. ఇన్సూరెన్స్ సర్టిఫికెట్

## 1. డ్రైవింగ్ లైసెన్స్

మోటర్ వెహికల్ చట్టం 1988 ప్రకారం ఏద్దైనా మోటారు వాహనాన్ని నడపాలంటే డ్రైవింగ్ లైసెన్స్ తప్పసరిగా వుండాలి.

స్థానిక రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ (ఆర్.టి.ఓ.)లో కానీ, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ (MVI) గారి ఆఫీసు వద్ద డ్రైవింగ్ లైసెన్స్‌ను మనము పొందవచ్చును.

**డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి వయస్సు:**

✦ 50 సిసి సామర్థ్యం లోపు వున్న మోటారు సైకిళ్ళకు 16 సంవత్సరాలు పూర్తయి వుండవలెను. 18 సంవత్సరాలు వచ్చు వరకు పెద్దల పర్యవేక్షణలో మాత్రమే ఈ 50 సిసి సామర్థ్యం లోపువున్న వాహనాలు నడపవలసి ఉంటుంది.

- 50 సిసి సామర్థ్యంపైనవున్న లైట్ మోటారు వాహనములను (మోటారు సైకిల్, కార్లు, జీపులు మొదలగునవి) నడపవలెనంటే 18 సంవత్సరములు నిండి వుండవలెను.

### డ్రైవింగ్ లైసెన్స్ పొందడమెలాగో మీకు తెలుసా?

**మోటారు డ్రైవింగ్ లైసెన్స్ రెండు దశలలో మనం పొందవచ్చు.**

1వ దశ: లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్పొందుట

2వ దశ: పర్మనెంట్ డ్రైవింగ్ లైసెన్స్ పొందుట

50 సంవత్సరాలు నిండనివారికి ఎలాంటి వైద్యధృవీకరణ పత్రము అవసరములేదు.

50 సంవత్సరములు నిండిన వారు తప్పనిసరిగా వైద్యధృవీకరణ పత్రము ఇవ్వవలసి ఉందును.

### 1వ దశ: లెర్నింగ్ లైసెన్స్ పొందు విధానము

లెర్నింగ్ లైసెన్స్ పొందాలనుకునే వారు ఈ క్రింది ధృవీకరణ పత్రములతో లైసెన్స్ ఇచ్చే అధికారి ముందు (RTO, MVI) హాజరు కావలసి వుండును.

- Form-II అనే ధరఖాస్తు పత్రము, ఇది RTO లేదా MVI గారి కార్యాలయములో లభించును.
- దరఖాస్తు చేసేవారు రూ. 15 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- నివాస ధృవీకరణ పత్రము, వయస్సు ధృవీకరణ పత్రము

  వీటికై ఈ క్రింది వాటిలో ఏవైనా దరఖాస్తుకు జత చేయవలసి ఉంటుంది. జీరాక్స్ ప్రతులపై గెజిటెడ్ ఆఫీసర్చే సంతకము చేయించవలసి ఉంటుంది.
- ఆధార్ కార్డు
- రేషన్ కార్డు

- ఓటరు గుర్తింపు కార్డు
- ఏదైనా బీమా పాలసీ
- పాస్‌పోర్ట్
- కరెంట్ లేదా టెలిఫోన్ బిల్లు
- సెంట్రల్ గవర్నమెంట్ లేదా స్టేట్ గవర్నమెంట్ ఆఫీసర్ చేత జారీ చేయబడిన వేతన ధృవీకరణ పత్రం
- పాఠశాలచే జారీ చేయబడిన ధృవీకరణ పత్రము, సివిల్ సర్జన్ కన్నా తక్కువ ర్యాంకు కాకుండా వున్న ఏదేని వైద్యుని ధృవీకరణపత్రము.
- మూడు పాస్‌పోర్టు ఫోటోలు

లెర్నర్ లైసెన్స్ పొందుగోరువారు అధికారిగారి ముందు ట్రాఫిక్ గుర్తుల గురించిన మరియు డ్రైవింగ్ చేసే వ్యక్తిపాటించవలసిన నియమాల గూర్చి ఒక పరీక్షకు హాజరు కావలసివుంటుంది.

ఇట్టి పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే లెర్నింగ్ లైసెన్స్ పొందడానికి అర్హులు.

లైట్ మోటారు వెహికిల్స్ (మోటర్ సైకిల్, కార్లు, జీపులు మొ॥) నడపడానికి 18 సంవత్సరాలు నిండివుండాలి.

రవాణాకు సంబంధించిన వాహనాలు నడపడానికి 20 సంవత్సరాలు నిండివుండాలి.

లెర్నింగ్ లైసెన్స్ ఆరు నెలల వరకు మాత్రమే చెల్లుబాటులో ఉంటుంది. ఆలోపు పర్మినెంట్ లైసెన్స్‌కోసం ధరఖాస్తు చేసుకోవాలి.

### 2వ దశ: పర్మినెంట్ లైసెన్స్

పర్మినెంట్ లైసెన్స్ పొందుటకు Form - 4 అనే ధరఖాస్తును నింపి దానికి ఈ క్రింద చూపబడిన పత్రాలను జతచేయవలసి ఉంటుంది.

- లెర్నర్ లైసెన్స్ జిరాక్స్ కాపీ

- CMV రూల్స్ లోని Rule-32లో పేర్కొన్న విధమైన ఫీజు (చలానా రూపంలో RTO/ MVI ఆఫీసులో చెల్లించాలి)
- ఇటీవలే తీయించుకున్న మూడు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు
- 50 సంవత్సరాలు దాటినట్లైతే Form 1Aలో వైద్య ధృవీకరణ పత్రము (సివిల్ సర్జన్ ర్యాంక్‌కి తగ్గకుండావున్న వైద్యుడి) రవాణా వాహనాలు నడపడానికైతే పైన పేర్కొన్న వాటితో పాటు Form - V ను సమర్పించవలెను.

ఈ ఫారంలు అన్నీ (Form-I, Form-II, Form-IV, Form-V) RTO లేదా MVI ఆఫీసులలో లభించును.

వీటితోపాటు తనవాహనముతో వచ్చి అధికారి (RTO or MVI) ముందు డ్రైవింగ్ టెస్టు తప్పని సరిగా పాస్ కావలసివుంటుంది.

### ఇంటర్‌నేషనల్ డ్రైవింగ్ పర్మిట్

ఇంటర్‌నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ పొందాలంటే IDP Formని నింపి 200=00 రూపాయల చలానాను RTO లేదా MVI అధికారిగారి కార్యాలయంలో చలానారూపంలో చెల్లించాలి. మూడు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు, మరియు పాస్‌పోర్ట్, ఇంతకు ముందు పొందిన డ్రైవింగ్‌లైసెన్స్ ప్రతిని దరఖాస్తుకు జత చేయవలసి వుంటుంది.

## 2. వాహన రిజిస్ట్రేషన్ పత్రము (Registration Certificate) R.C.

ఆర్.టి.ఓ. లేదా ఎం.వి.ఐ. వద్ద రిజిస్ట్రేషన్ చేయించని వాహనాన్ని నడుపుట నేరము.

రిజిస్ట్రేషన్ రెండు రకాలు

### 1. టెంపరరీ రిజిస్ట్రేషన్

కొత్త వాహనాన్ని కొనేటప్పుడు వాహనము అమ్మే డీలరు వాహనాన్ని టెంపరరీ రిజిస్ట్రేషన్ చేయించిన తరవాతే అమ్మవలసి ఉంటుంది.

Form No-21 ద్వారా టెంపరరీ రిజిస్ట్రేషన్ చేయిస్తారు.

## 2. పర్మినెంట్ రిజిస్ట్రేషన్

వాహనమును కొన్న 30 రోజులలోపు వాహనాన్ని పర్మినెంటు రిజిస్ట్రేషన్ చేసుకోవలసి వుంటుంది.

పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి Form-20ని భర్తీచేసి దానికి క్రింద ప్రతులను జతపరచవలసి ఉంటుంది.

- సేల్స్ సర్టిఫికెట్ Form No-21
- ఇన్యూరెన్స్ సర్టిఫికెట్
- అడ్రస్ ప్రూఫ్ సర్టిఫికెట్
- పొల్యూషన్ సర్టిఫికెట్
- CMV రూల్స్‌లోని రూల్ 81 ప్రకారం ఫీజు చెల్లించి వాహనమును (RTO or MVI Office) లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

## 3. పొల్యూషన్ సర్టిఫికెట్ PUC (Pollution Under Control) Certificate

తెలంగాణా రాష్ట్రంలో వివిధ రకాలైన 80 లక్షల వాహనాలు ఉన్నాయి. వీటి సంఖ్య ప్రతిరోజు పెరుగుతూనే ఉంది. ఈ వాహనాలు విడుదల చేసే విషవాయువుల వలన ప్రజల ఆరోగ్యానికి హాని జరుగుతుంది. ముఖ్యంగా 15 సంవత్సరాలపైబడిన వాహనాలు వెదజల్లే కాలుష్యము ప్రజలకు ప్రాణాంతకమవుతుంది.

ఈ వాహనాలు వెదజల్లే కాలుష్యాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రతీ వాహనానికి "కాలుష్య నియంత్రణ పత్రము" (Polution Certificate) తప్పనిసరి చేసింది. ప్రభుత్వం కాలుష్యనియంత్రణ పత్రము లేనిదే వాహనాన్ని నడపకూడదు.

### 4. ఇన్సూరెన్స్ సర్టిఫికెట్

వాహనానికి ఇన్సూరెన్స్ కలిగి వుండడం అన్నది తప్పని సరి. వాహనానికి సరియైన ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేకుండా వాహనం నడపడం నేరం కూడా. (Road Traffic Act 1988)

ఇన్సూరెన్స్ అన్నది వాహనదారు యొక్క అవసరం కూడా. ఎందుకంటే ఒక వేళ ప్రమాదం జరిగినప్పుడు వాహనానికి ఏదైన నష్టం జరిగితే ఆ నష్టాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ భరిస్తుంది. ప్రమాదంలో ఎవరైనా గాయపడినా లేదా చనిపోయినా దానికి సంబంధించిన నష్టపరిహారాన్ని ఆ ఇన్సూరెన్స్ కంపెనీ భరిస్తుంది.

కాబట్టి తన జాగ్రత్తకు గానీ, ఇతరుల జాగ్రత్తకోసం కానీ వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలి.

**పట్టిక: తెలంగాణలో రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘిస్తే విధించే జరిమానాలు**

| క్ర.సం. | నేరం | జరిమానా (రూ.లలో) |
|---|---|---|
| 1. | లైసెన్స్ లేకుండా వాహనం నడపడం | 500 |
| 2. | పరిమితికి మించి వేగంగా వాహనాన్ని నడపడం | 100 |
| 3. | రేసింగ్ | 500 |
| 4. | ద్విచక్ర వాహనాలపై ఓవర్ లోడ్ | 100 |
| 5. | హెల్మెట్ ధరించకపోవడం | 100 |
| 6. | సీటుబెల్టు ధరించకపోవడం | 100 |
| 7. | ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడపడం | 1000 |